# అనగనగా... ఒక కథ

## పనే దైవం

శ్రీధరం చదువు పూర్తయింది. నిరుద్యోగ భారం భరిస్తున్నాడు. తను కోరుకున్నట్లు ఏ బ్యాంకులోనైనా చేరిపోతే జీవితం అంతా దర్జాగా గడిపెయ్యెచ్చు. అదే లక్ష్యంతో చిన్న ఉద్యోగాలు ఎన్నొచ్చినా, ఆ అపాయింట్‌మెంట్ కాయితాల్ని చింపేస్తున్నాడు. ఏదో అనుభవం కోసం ఇంటర్వ్యూకెళ్తున్నాడు గానీ, ఆ బోడి అణా కానీ ఉద్యోగాలు తను చేస్తాడా ఏంటి?

కొడుకు ప్రవర్తనకి సుబ్రహ్మణ్యశాస్త్రి చాలా నొచ్చుకుంటాడు. గుళ్లో పూజారిగా అతనికొచ్చే జీతం అంతంతమాత్రం. దానితోనే ఈడొచ్చిన కూతుర్నీ, తల్లీతండ్రీ లేని మేనల్లుణ్ణీ ఈ సుపుత్రుడు శ్రీధరాన్ని పెంచి పోషిస్తున్నాడు.

శ్రీధరం ఏదైనా ఉద్యోగం చేసుకుంటే...కాస్త చెయ్యాదేది కానీ ఆ మహానుభావుడి మూర్ఖత్వం వల్ల లేని పోని బెంగే మిగుల్తోంది. రోజూ తండ్రీకొడుకుల ఘర్షణతో ఎవరో ఒకళ్లు నిరాహారంగా ఉంటోండటం రివాజైపోయింది. మేనల్లుడు శంకరం మావయ్యని ఓదారిస్తే...చెల్లెలు సునీత అన్నగార్ని బుజ్జగిస్తూంటుంది.

"పట్టెడన్నం సంపాదించలేడు గానీ పట్టుదలకేం తక్కువలేదు" అని సుబ్రహ్మణ్య శాస్త్రి గారంటే..."నీలాగే ముష్టి బతుకు బతకాలా.." అంటూ నిష్టూరాలాడతాడు కొడుకు. మాటకి మాట అనుకుంటూ యుద్ధ'రంగం' అయిపోయాక...ఎవరో ఒకళ్లు బైటపడతారు.

* * *

ఓ రోజు పొద్దున్నే "పట్నం వెళ్లాలి ఓ రెండు వందలు కావాలి" అన్నాడు శ్రీధర్.

"నా దగ్గర లేవురా. జీతాలింకా రాలేదు కదా..అయినా నువ్ నెలకి నాలుగుసార్లు పట్నం వెళ్లి సాధించేదేమిట్రా" అన్నాడు శాస్త్రిగారు.

"నేనక్కడేం జల్సాలు చేయట్లేదు. సినిమాలూ, షికార్లూ చేయట్లేదు. ఉద్యోగం మనూళ్లో కూచుని తపస్సు చేస్తే రాదు."

"చూడు. శ్రీధరం నేను నీకు చాలాసార్లు చెప్పాను. చిన్నా పెద్దా అనకుండా ఏదో ఉద్యోగంలో చేరు. ఆ వచ్చే జీతం పెట్టుబడిగా పెట్టుకుని, నీక్కావల్సిన ఉద్యోగం సంపాదించుకో..."

"నాకు తెల్సు మిమ్మల్ని దబ్బడిగితే ఇలా నీతులు మొదలెడతారని!! ఛీ ఛీ.. ఈ ఇంట్లో పుట్టకుండా ఏ అడుక్కునే వాళ్లింట్లో పుట్టినా హాయిగా దర్జాగా ఉండొచ్చు..."

"ఇప్పుడు నువ్ చేసే పనీ అదేలే..."

ఇలా తండ్రీ కొడుకుల మధ్య రావణకాష్టం మళ్లీ రాజుకుంది.

"మావయ్యా నువ్వు ఊరుకో..." అని శంకరం సముదాయించి "బావా నీకు కావల్సినవి రెండొందలు కదా. నా దగ్గరున్నాయి తీసుకో" అంటూ శంకరం దబ్బిచ్చాడు. శ్రీధరం తీసుకున్నాడు.

"నీ వయస్సు వాడే నీ అంత డిగ్రీలు కూడా చదవలేదు. అయినా పౌరోహిత్యం చేస్తూ, స్వతంత్రంగా సంపాదించుకుంటున్నాడు. వాణ్ణి చూసైనా బుద్ధి తెచ్చుకో."

"పోన్లే మావయ్యా...ఇంక నువ్ ఆగు- శ్రీధర్ నువ్వెళ్లు ఊళ్లోకి. బస్సు వచ్చే టైమైంది." అన్నాడు శంకరం. శ్రీధరం విసరుగా బయల్దేరాడు.

"నీకూ వాడికీ ఒకేసారి పుణ్యావచనం, పూజలు చేయించటం నేర్పాను. వాడు ఆ దిక్కుమాలిన డిగ్రీ చదవకపోతే చక్కగా పౌరోహిత్యం చేసుకునేవాడు. వాడికీ వృత్తన్నా, మన కులం అన్నా కూడా అసహ్యమే ఏంటో ఖర్మ!"

"బావకి ఏదో రోజున మంచి ఉద్యోగం వస్తుంది మావయ్యా. నువ్ తనని ఏమనకు"

"అనద్దనే అనుకుంటాన్రా. కానీ కడుపులో బాధ ఇలా తన్నుకొస్తుంటుంది. ఏదో నువ్ వ్రతాలూ పూజలూ అంటూ వెళ్లి రెండు సేర్లు బియ్యం, నాలుగు స్వయంపాకాలూ తెచ్చి పడేస్తున్నావు గనుక ఖర్చులు వెళ్లిపోతున్నాయి. నీకు ఋణ పడుతున్నందుకు సిగ్గుపడట్లేదురా!"

"మావయ్యా నాకు నువ్వు ఋణపడ్డం ఏమిటి? నేనే నీకు బాకీ చెల్లిస్తున్నాను. చిన్నప్పట్నుంచీ మీ ఇంట్లో పెట్టుకుని నాలుగు ముక్కలు నేర్పి నా కాళ్ల మీద నన్ను నిలబడేట్లు చేశావు. ఆ రోజు నువ్ నేర్పిన చదువుకి ఇది గురుదక్షిణ అనుకో" అన్నాడు శంకరం వినయంగా.

సునీతకి బావ మీద ఇంకా గౌరవం పెరిగిపోయింది.

కాదు. ప్రేమ పెరిగిపోయింది.

"అహా...ఇద్దరూ ఒకళ్లనొకళ్లు భజన చేసుకుంటూనే ఉంటారా ఈవాళ దేవుడికి ఉపవాసమా నాన్నా"

"దేవుడికి ఉపవాసమైనా నీకు ప్రసాదం తప్పదుగా" హాస్యమాడాడు శంకరం.

* * *

తనని తిట్టిపోస్తూ..శంకరాన్ని మెచ్చుకోవడం సహించలేకపోతున్నాడు శ్రీధర్. వీలు దొరికినప్పుడల్లా శంకరంపై వ్యంగ్య విమర్శనాస్త్రాలు వేస్తున్నాడు. త్వరలో సునీతని పెళ్లి చేసుకుని ఇంటికింకా ముఖ్య అతిథి అవుతాడంటే తననెవ్వరూ పట్టించుకోరని మథనపడుతున్నాడు. అసలీ పెళ్లి తప్పించి తనో మంచి ఉద్యోగం సంపాదించి సునీతకి మంచి పెళ్లి చేయాలి. సమయం సందర్భం కలిసొచ్చిన ఓసారి శంకరం శ్రీధరం చేతికి రెడ్ హేండెడ్‌గా దొరికిపోయాడు. పూజలు చేయించాను వ్రతాలు చేయించానని ఇంట్లో బియ్యం, కూరలూ గుమ్మరించి మార్కులు వేయించుకుంటున్న

"నేనే వెళ్లిపోతాన్లే. నిజం చెప్పి మావయ్యని బాధపెట్టకు." బతిమాలుకుంటూ అన్నాడు శంకరం." శ్రీధరం విశ్వరూపం ఎత్తినంత ఎత్తుగా నిలబడ్డట్టు శంకరాన్ని చీమను చూసినంత అసహ్యంగా చూస్తూ చిద్విలాసంగా నవ్వాడు.

శంకరం చేస్తూన్న పనేమిటో శ్రీధరం కనిపెట్టేశాడు. షేక్ మస్తాన్ టైలరింగ్ షాపులో ప్రతీ సాయంత్రం రహస్యంగా వెళ్లి టైలరింగ్ పనిచేస్తాడు. ఆయనిచ్చిన కూలి డబ్బులతో బియ్యం, కూరలు కొని పసుపు, తమలపాకులు కొని దాంట్లో కలిపి ఫోజు కొట్టుకుంటూ ఇంటికి తెస్తున్నాడు. ఇంట్లో వాళ్లందరికి వీడో దేవుడైపోయాడు.



ఇలాటి మిషన్ కూలికి పిల్లనివ్వబోతోన్న తన తండ్రి మీద కోపం పెరిగింది. అయినా తండ్రిదేం తప్పులేదు శంకరందే మోసమంతా అనుకున్నాడు.

ఈ రోజు శంకరం జీవితం బట్టబయలు చేసి తండ్రి చేతే మెడ పట్టించి బయటికి గెంటేయాలనుకున్నాడు.

శంకరం ఈ ప్రమాదాన్ని ఊహించాడు. శ్రీధరంతో "బావా! మావయ్యతో ఈ విషయం చెప్పకు" అన్నాడు.

"ఏం? నిన్ను ఇంట్లోంచి గెంటేస్తాదని భయమా?"

"భయం కాదు. నేను ఎక్కడైనా బతగ్గలను. ఏ పనైనా చేయగలను అనే నమ్మకం నాకుంది. నా బాధల్లా మావయ్య బాధ పడ్తాడని. పూజలు, వ్రతాలు చేయించి నేను సంపాదించుకొచ్చి ఇంటికి సాయపడుతున్నానని ఆయన ఎంతో సంతోషంతో ఉంటున్నాడు. నువ్వు నిజం చెప్పి ఆయన సంతోషాన్ని చెడగొట్టొద్దు."

"నక్కని ఆవు అనుకొని, పులిని మేక అనుకొని, దొంగని దేవుడు అనుకొని, నిన్నో మహానుభావుడనుకొని అబద్ధంలోనే ఆయన్ను బతకమంటావా" వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు శ్రీధరం."సత్యంబ్రూయాత్ - ప్రియంబ్రూయాత్ - నబ్రూయాత్ - సత్యమప్రియం అంటే తెలుసుగా- నిజం చెప్పు. ప్రియమైన మాట చెప్పు. నిజమైనా అప్రియమైన మాట చెప్పకు అని"

"అంటే...నువ్విలాగే అబద్ధాలతో అన్నాన్ని పెడ్తావన్నమాట మాకు" రోషం, ఉక్రోషం కలిపి అన్నాడు శ్రీధరం.

"కోపం వద్దు బావా..."

"వరసలొద్దు... పాయింటులోకి రా- నువ్వే వెళ్లిపోతావా? నాన్నతో గెంటించమంటావా"

"నేనే వెళ్లిపోతాన్లే. నిజం చెప్పి మావయ్యని బాధపెట్టకు." బతిమాలుకుంటూ అన్నాడు శంకరం." శ్రీధరం విశ్వరూపం ఎత్తినంత ఎత్తుగా నిలబడ్డట్టు శంకరాన్ని చీమను చూసినంత అసహ్యంగా చూస్తూ చిద్విలాసంగా నవ్వాడు.

"నువ్వు...వెళ్లిపోవద్దు. నా ఇష్టం వచ్చినప్పుడు...నేనే పొమ్మంటాను. అప్పటి దాకా..నాకు.. టాక్సు కట్టు" అని అభయం ఇచ్చాడు.

ఇంటి పెరట్లో జరుగుతున్న ఈ సంభాషణ శాస్త్రిగారు వింటున్నారని వాళ్లిద్దరికీ తెలియదు. "ఎందుకు కట్టాలిరా నీకు టాక్స్?" అంటూ ఆయన దగ్గరకొస్తూంటే ఇద్దరూ వణికిపోయారు.

"శంకరం నువ్ తప్పు చేశావు. చాలా పెద్ద తప్పు చేశావు. నువ్ చేస్తున్న పని తప్పుడుపని అని భావించి దాచి ఉంచావు. పనంటే అన్నం పెట్టే అమ్మలాంటిది. పని అంటే ఆస్తినిచ్చే నాన్నలాంటిది! పనిని చెయ్యనివాడూ చేస్తూన్న పనిని ప్రేమించని వాడు తల్లిదండ్రులకి ద్రోహం చేస్తున్నంత తప్పు చేసినట్లే. నువ్వు దర్జీ పని చేస్తావు. ఆ విషయంలో రహస్యం ఎందుకు? ఒరే శ్రీధరం. శంకరం ఈ పని చేస్తున్నాడన్న విషయం నాకెప్పుడో తెల్సురా. వాడు సిగ్గుపడి చెప్పడానికి మొహమాటపడుతున్నాడని వాడంతట వాడే చెప్పాలనీ...నేను అడగలేదు.."

శంకరం కళ్లల్లో ఈ మాటలకి నీళ్లు తిరిగాయి.

"కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం... శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి-రంపం-కొడవలి-నాగలి-సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలూ...ప్రాణం... భాగ్యం...ప్రణవం అన్నాడురా మహాకవి శ్రీశ్రీ. అది తెలుసుకుంటే ఏ పనైనా చేయొచ్చు. ఏ పనినైనా ప్రేమించచ్చు. ఆ పనిని ఆరాధించవచ్చు. అదే అర్చన. ఆ అర్చనే వరాన్ని ఇస్తుంది. ఫలాన్ని ఇస్తుంది"

శంకరం పులకించిపోయాడు. శ్రీధరం తండ్రి కాళ్ల ముందు మోకరిల్లి పడిపోయాడు.

*